
# సత్తా ఉంటే ఉద్యోగం మీదే

- ఇంజినీర్లకు ఉపాధికి కొదవలేదు
- తూతూమంత్రం చదువులకు ఉద్యోగాలు రావు
- ఐటీరంగానికి తిరుగు లేదు
- 'ఈనాడు'తో మైక్రోసాఫ్ట్ ఇండియా మాజీ అధిపతి శ్రీని కొప్పోలు

ఈనాడు – హైదరాబాద్

నేడు ప్రతిరంగమూ కంప్యూటర్‌పైనే ఆధారపడినందున ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు లేవనే పరిస్థితి ఇప్పుడే కాదు.. భవిష్యత్తులోనూ ఉండదని భారతదేశ మైక్రోసాఫ్ట్ విభాగానికి దాదాపు 13 ఏళ్లపాటు అధినేతగా బాధ్యతలు నిర్వర్తించిన శ్రీని కొప్పోలు భరోసా ఇస్తున్నారు. అయితే, మొక్కుబడిగా ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేస్తే మాత్రం.. మార్కెట్లో ఎన్ని ఉద్యోగాలున్నా కూడా ఒక్క ఉద్యోగం కూడా దొరకదని హెచ్చరిస్తున్నారు. లక్ష్యసాధనతో, ప్రణాళికబద్ధంగా చదువుకొని మంచి నైపుణ్యం సాధించిన విద్యార్థులనే ఉద్యోగాలు వరిస్తాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఓవైపు ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమై, మరోవైపు.. నాలుగో సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు జరుగుతున్న సందర్భంగా శ్రీని కొప్పోలుతో 'ఈనాడు' ప్రతినిధి ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యార్థులకు ఆయన అందించిన మార్గదర్శక సూచనలు...

- మారుతున్న అవసరాలకు అనుగుణంగా కంప్యూటర్ రంగం ముందుకు దూసుకుపోవడమేతప్ప వెనక్కి తగ్గదు. దీనివల్ల నియామకాలకు కొదవే ఉండదు. అప్పుడప్పుడు ప్రతికూల పరిస్థితులు ఎదురైనా అవి తాత్కాలికమే.
- మనదేశంలో ఇంజినీరింగ్ విద్యాభ్యాసానికి, అమెరికాలో అనుసరిస్తున్న విధానానికి చాలా తేడా ఉంది. ఇక్కడి ఇంజినీరింగ్ విద్యార్థులు ఎంచుకున్న కోర్సుకే పరిమితమవుతున్నారు. దీనివల్ల విద్యార్థుల పరిజ్ఞానం పరిమితంగా ఉండిపోతోంది. అమెరికాలో ఎంచుకున్న కోర్సును అనుసరించి 15 సబ్జెక్టులు ఉంటే.. మిగిలిన సబ్జెక్టుల్లో ఐచ్ఛికాలు అనేకం ఉంటాయి. దీంతో అక్కడి ఇంజినీరింగ్ విద్యార్థులు సంబంధిత కోర్సుపైనే కాకుండా.. ఇతర అంశాలపైనా తగిన అవగాహన పొందుతున్నారు. ఫలితంగా వారికి వివిధ రంగాల్లో అవకాశాలు ఉంటున్నాయి. కానీ, మనరాష్ట్రంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారికి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం దొరకకపోతే మరో ప్రత్యామ్నాయమే లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విధానంలో మార్పు రావాలి.
- అవసరాలకు అనుగుణంగా అమెరికాలో విద్యావిధానం కొనసాగుతోంది. న్యూయార్క్, బోస్టన్, టెక్సాస్ నగరాల్లో పరిశ్రమలకు అనుబంధంగా కళాశాలలు ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు నిపుణులు కళాశాలల్లో అవగాహన తరగతులను నిర్వహిస్తుంటారు. దీనివల్ల సుశిక్షితులైన విద్యార్థులకు బయటకొస్తున్నారు. రాష్ట్రంలో ఇలాంటి ప్రయత్నాలే జరగడం లేదు. కళాశాలలకు పరిశ్రమలకు సంబంధమే ఉండటం లేదు.
- పాఠ్యప్రణాళిక, ఉన్నతవిద్య, ఉద్యోగావకాశాల గురించి విద్యార్థులకు ఇంటర్మీడియట్ రెండోసంవత్సరంలో ఉన్నప్పుడే వివరించాలి. దీంతో వారికి ఒక అవగాహన వస్తుంది. ఈ విషయంలో తల్లిదండ్రులు చొరవ చూపాలి. అమెరికాలో విద్యార్థులకు ఉన్నతవిద్య తీరుతెన్నులపై చాలాముందుగానే పూర్తి అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్రంలో ఈ విధానం కొరవడినందున ఆసక్తి లేని వారు కూడా ఇంజినీరింగ్‌లో చేరి నష్టపోతున్నారు.
- రాష్ట్రంలో దాదాపు 700 ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. వీటిలోంచి వస్తున్న లక్షన్నర మంది విద్యార్థుల్లో నైపుణ్యం ఉన్న వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. బయట ఉద్యోగావకాశాలు ఉన్నా కూడా వాటిని అందిపుచ్చుకునే సామర్థ్యం విద్యార్థుల్లో ఉండడం లేదు. ఇన్ని కాలేజీల బదులు పరిమిత సంఖ్యలో కొన్నే ఉండిఉంటే.. కళాశాలల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొని.. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్య లభించి ఉండేది.
- తాము చదివిన కాలేజీలో మౌలికసదుపాయాలు లేవని, సరిగా బోధించలేదని.. దీనివల్లే తాము ఇలా తయారయ్యామని పలువురు విద్యార్థులు చేస్తున్న వాదన కూడా సమంజసంగా లేదు. అన్నింటికీ సిద్ధమయ్యే ఇంజినీరింగ్‌లో చేరాలి. ఈరోజుల్లో ఇంటర్నెట్ వంటి ఎన్నో సదుపాయాలున్నాయి. వాటిద్వారా పాఠాలు నేర్చుకోవచ్చు. 'నేను ఎక్కడున్నా? నాలోని లోపాలేమిటి? వాటినెలా అధిగమించాలి?' అని ప్రశ్నించుకుంటూ వెళ్తే ఇంజినీరింగ్ పూర్తయ్యే నాలుగేళ్లలో పురోగతి సాధించి మంచి ఉద్యోగం సంపాదించటం సాధ్యమే.
- పరీక్షల్లో ఉత్తీర్ణతే ధ్యేయంగా ఇంజినీరింగ్ కోర్సు చదివితే అసలు ఉపయోగమే ఉండదు. విషయాలపట్ల విస్తృతమైన అవగాహన, ప్రయోగ విశ్లేషణ ఉంటేనే రాణించగలరు. నైపుణ్యం, సామర్థ్యం, ప్రతిభ ఆధారంగానే నియామక సంస్థలు విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. ప్రతి అంశంలోనూ గుణాత్మక ప్రతిభ అవసరం. దీనికి నాలుగో సంవత్సరంలో కసరత్తు ప్రారంభిస్తే ఫలితం ఉండదు. ఇంజినీరింగ్‌లో చేరిన తొలి ఏడాది నుంచే కార్యాచరణ ప్రణాళిక ఉండాలి.
- ప్రాంగణ నియామకాల్లో విద్యార్థులకు వారు ఎంచుకున్న కోర్సుపై ఎంత అవగాహన ఉందన్న దానిని ఆయాసంస్థలు నిశితంగా పరీక్షిస్తాయి. సబ్జెక్టుల మీద అవగాహన లేకుండా డిగ్రీ పూర్తిచేసిన వారిని నియామకసంస్థలు పక్కనపెడతాయి. అందువల్ల సబ్జెక్టులపై గట్టిపట్టు సాధించాలి.
- ఇంజినీర్‌గా రాణించేందుకు మాధ్యమం అనేదొక అంశమే కాదు. తెలుగు మీడియంలో చదువుకొని కూడా ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చు. విషయంపై పట్టు ఉంటే భావవ్యక్తీకరణలో ఇబ్బంది ఎదురైనా అధిగమించొచ్చు. అమెరికాలో చదువుకొనే చైనీయులు.. తరగతిగదిలో అధ్యాపకులు చెప్పే పాఠాలను వెంటనే అర్థం చేసుకోలేరు. అధ్యాపకులు చెప్పిన పదాలను నెమరువేసుకుంటూ వెంటనే డిక్షనరీలో అర్థాలు చూసుకుంటారు. ఈ విధంగా అవగాహన పెంచుకుంటారు.



## నేపథ్యం

శ్రీని కొప్పోలు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజినీరింగ్ చదువుకున్నారు. అనంతరం కంప్యూటర్ రంగంలో ప్రవేశించాలన్న ఉద్దేశంతో అమెరికాలో ఉన్నతవిద్య అభ్యసించారు. మనదేశంలో మైక్రోసాఫ్ట్ సంస్థకు అధిపతిగా 13 ఏళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం.. ఐటీ విద్యార్థులకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను 'మిషన్ఆర్అండ్‌డీ' సంస్థ ద్వారా నిర్వహిస్తున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం 'ఏంజిల్ ఇన్వెస్టర్' అనే సంస్థ ద్వారా తోడ్పాటును అందిస్తున్నారు.